క్లుప్తంగా

శరన్నవరాత్రి ఉత్సవాలకు పందిరిరాట



పూజా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న యూనియన్ సభ్యులు

నరసన్నపేట: స్థానిక జయదుర్గా భవానీ టాకీస్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న శరన్నవరాత్రి ఉత్సవాలకు పందిరిరాట కార్యక్రమాన్ని బుధవారం భక్తిశ్రద్ధలతో చేపట్టారు. ఈ సందర్భంగా అర్చకులు మావుదూరి జగదీష్ బాబు మాట్లాడుతూ ఈ నెల 22 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ సభ్యులతోపాటు పలువురు పాల్గొన్నారు.

12న ఉపాధి అక్రమాలపై విచారణ

సారవకోట: ఈ నెల 12న మండలంలోని గొర్రిబంద పంచాయతీలో ఉపాధి హామీ అక్రమాలపై విచారణ చేయనున్నారు. ఉపాధి పనుల్లో జరిగిన అక్రమాలపై సాక్షిలో వరుసగా రెండు రోజులు కథనాలు ప్రచురితం కావడంతో జిల్లా శాఖాధికారులు స్పందించారు. ఈ అక్రమాలపై ఫిర్యాదు చేసిన గొర్రిబంద గ్రామానికి చెందిన పలువురికి విచారణకు హాజరుకావాలని జిల్లా అధికారులు లిఖిత పూర్వకంగా నోటీసులు పంపించారు. దీనిపై గొర్రిబంద సచివాలయంలో విచారణ చేపట్టనున్నట్లు సమాచారం.

రికార్డులు సిద్ధం చేయండి



ఉపాధి సిబ్బందితో మాట్లాడుతున్న టెక్కలి ఏపీడీ శైలజ

మెళియాపుట్టి: సామాజిక తనిఖీ త్వరలోనే నిర్వహించనున్న నేపథ్యంలో క్షేత్రస్థాయిలో రికార్డులు సిద్ధం చేయాలని టెక్కలి ఏపీడీ శైలజ అన్నారు. బుధవారం స్థానిక ఉపాధి కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. 2024–25లో చేసిన ఉపాధి పనులకు సంబంధించి ప్రతీ గ్రామ పంచాయతీలో 7 రకాల రికార్డులు, జాబ్ కార్డులు, పనుల వద్ద సూచికలు సక్రమంగా ఉండేలా చూసుకోవాలన్నారు. హార్టీకల్చర్, ఎవెన్యూ, ఇన్స్టిట్యూట్, బ్లాక్ ప్లాంటేషన్, ఇతర ప్రాజెక్టుల ద్వారా నాటిన మొక్కల సంరక్షణ సరిగా ఉండేలా చూడాలని, వాటికి వాచ్ అండ్ వార్డ్ బిల్లులు చెల్లించాలన్నారు. డ్వామా పీడీ ఆదేశాల మేరకు లక్ష్యాలను చేరుకోవాలన్నారు. ఏపీఓ తెంబూరు రవి, ఈసీ తారా ఆదినారాయణ రెడ్డి, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత

మెళియాపుట్టి: హిందూ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతి ఒక్కరూ పాటించాలని, ఆధ్యాత్మిక చింతనకు సమయం కేటాయించాలని దత్త పీఠం (మైసూర్) చిన్న పీఠాధిపతి దత్త విజయానంద తీర్థ స్వామీజీ (బాలస్వామి) అన్నారు. బుధవారం పెద్దపద్మాపురం గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. శబ్దం, గందరగోళ ఆలోచనలతో నిండిన ఈ ప్రపంచంలో శాంతిని నెలకొల్పాలన్నారు. ప్రజలకు ఆశీర్వచనాలు అందించి మైసూర్ పీఠం నుంచి తీసుకువచ్చిన ప్రసాదాలను పంపిణీ చేశారు. గ్రామస్తులు అన్నసమారాధన కార్యక్రమం ఏర్పాటుచేసి భక్తులకు ప్రసాదాలు అందించారు. గురుదత్త కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రణభేరిని విజయవంతం చేయండి

జలుమూరు: ఉపాధ్యాయ, ఉద్యోగుల ఆర్థిక, విద్యారంగ సమస్యలపై ఈ నెల 15 నుంచి 19వ తేదీ వరకు నిర్వహించనున్న రణభేరి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బమ్మిడి శ్రీరామ్మూర్తి కోరారు. బుధవారం చల్లవానిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో యూనియన్ సమావేశం నిర్వహించారు. రణభేరి పోస్టర్‌ను ఆవిష్కరించారు. రాష్ట్ర ప్రభుత్వం గడిచిన 15 నెలలుగా ఏ ఒక్క సమస్యా పరిష్కరించలేదన్నారు. విద్యా హక్కు చట్టం, ప్రపంచ బ్యాంక్ సాల్ట్ పథకం అమలు పేరుతో మూడో వంతు ప్రైమరీ స్కూళ్లు ఇప్పటికే సింగిల్ టీచర్ స్కూళ్లుగా మారిపోయాయన్నారు. ఈ నెల 25న విజయవాడలో భారీ సభ నిర్వహించనున్నామన్నారు. జిల్లా గౌరవ అధ్యక్షుడు కోరాడ వైకుంఠరావు, మండల శాఖ ప్రతినిధులు జి.రాము, ఎం.వైకుంఠరావు, సూర వెంకటరావు, ఎస్.నిర్మాలాదేవి, ఎ.బుచ్చిబాబు, ఎస్.పురుషోత్తమం, కె.రాజారావు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగంపై విచారణ

సరుబుజ్జిలి: మండలంలోని మతలబుపేట పంచాయతీలో 2016– 2021 కాలంలో పంచాయతీకి వచ్చిన ఏకగ్రీవ నిధులు దుర్వినియోగం జరిగినట్లు ఫిర్యాదులు వచ్చాయి. దీనిపై డీఎల్‌పీఓ గోపీబాల బుధవారం గ్రామంలో విచారణ చేపట్టారు. పంచాయతీ రికార్డులను పూర్తిస్థాయిలో పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తామన్నారు. ఈఓపీ ఆర్డీ బొడ్డేపల్లి రామారావు పాల్గొన్నారు.

మలుపులు.. ప్రమాదాలకు పిలుపులు

- కానరాని హెచ్చరిక బోర్డులు
- పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలు
- పట్టించుకోని అధికారులు

ఆమదాలవలస నియోజకవర్గంలోని రహదారులు, ఇటీవల జరిగిన ప్రమాదాలు

మండలం	రహదారులు	4 నెలల్లో జరిగిన ప్రమాదాలు
సరుబుజ్జిలి	22	14
బూర్జ	24	10
ఆమదాలవలస	34	13
పొందూరు	28	12



ఆమదాలవలస మండలం పొన్నాంపేట వద్ద ఉన్న మలుపు



పురుషోత్తపురం వద్ద ఉన్న భారీ మలుపు



అలమాజీపేట వద్ద ప్రమాదకర మలుపు

సరుబుజ్జిలి: ప్రజల ప్రాణాల మీదికి వచ్చినా కొన్ని శాఖల అధికారులకు చీమకుట్టినట్లయినా అనిపించడంలేదు. అధికారులు నిర్లక్ష్యం వలన భారీ మూల్యాన్ని చెల్లించుకోవాల్సి వస్తుంది. ఆమదాలవలస నియోజకవర్గంలోని పలు ప్రధాన రహదారుల మలుపుల వద్ద ఎటువంటి హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.

ప్రమాదాలు జరిగిన ప్రదేశాలు..

గత నాలుగు నెలల్లో నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లోని రహదారుల మలుపులున్న ప్రదేశాల్లో అధికంగా ప్రమాదాలు జరిగాయి. ఈ ప్రమాదాల్లో పలువురు తీవ్ర గాయపడ్డారు. పలువురి ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి.

- సరుబుజ్జిలి మండలంలోని కొండవలస జంక్షన్ మలుపు వద్ద ఏప్రిల్‌లో లారీ ఢీకొని యువకుడు మృతి చెందాడు. షళంత్రి జంక్షన్ వద్ద ఎంఎంపురం గ్రామానికి చెందిన కార్పెంటర్ మృతి చెందాడు. యరగాం–పురుషోత్తపురం ఓపెన్ హెడ్ చానల్ వద్ద ఓ వ్యక్తి వాహనం అదుపుతప్పి కాలువలో పడి తీవ్ర గాయాల పాలయ్యాడు.
- జూన్‌లో పొందూరు మండలం కింతలి జంక్షన్ వద్ద ఆటో, ద్విచక్రవాహనం ఢీకొన్న ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి.
- జూలైలో ఆమదాలవలస మండలం కొర్లకోట జంక్షన్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆటో బోల్తాపడి ఇద్దరు గాయపడ్డారు. బొబ్బిలిపేట వద్ద ఆటో, మినీ వ్యాను ఢీకొట్టిన ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న ఐదుగురు గాయపడ్డారు.
- బూర్జ మండలం మదనాపురం, కొల్లివలస, ఎన్నిరామన్నపేట, పాలవలస జంక్షన్లలో జరిగిన ప్రమాదాల్లో పలువురు గాయపడ్డారు. అక్కులపేట–గుత్తావల్లి రహదారిలో ద్విచక్ర వాహనాలు ఢీకొన్న సంఘటనలో యువకుడు మృతి చెందాడు.

ప్రమాదకరమైన ప్రదేశాలివే..

నియోజకవర్గంలోని పలు మండలాల్లో గల రహదారుల మలుపుల వద్ద ప్రమాద సూచికలు లేకపోవడంతో తరచూ రహదారులు రక్తమోడుతున్నాయి.

- సరుబుజ్జిలి మండలంలోని కొండవలస, షళంత్రి, బప్పడాం, సవలాపురం, పాలవలస, పురుషోత్తపురం, అలమాజీపేట వద్ద ప్రమాదకరమైన మలుపులున్నాయి.
- ఆమదాలవలస మండలం బొబ్బిలిపేట, తిమ్మాపురం, అక్కులపేట, మండాది, ఈసర్లపేట, జగ్గుశాస్త్రులపేట, కొత్తవలస, చీమలవలస, కొర్లకోట, పార్వతీశంపేట, దివంజిపేట, పొన్నాం, చెవ్వాకులపేట వద్ద మలుపులున్నాయి.
- పొందూరు మండలం రాపాక, కింతలి, కనిమెట్ట, బురిడికంచారాం, తోలాపి, వి.ఆర్.గూడెం, బాణాం, పిల్లలవలస, దల్లవలస వద్ద ఉన్న మలుపుల వద్ద ఎటువంటి హెచ్చరిక బోర్డులు లేవు.
- బూర్జ మండలం తుడ్డలి, మత్రిపాడు,కొండపేట, ఉప్పినివలస, వైకుంఠపురం, లచ్చయ్యపేట, పెద్దపేట, లక్కుపురం, సింగన్నపాలెం, టీఆర్‌రాజుపేట, కొల్లివలస, గుత్తావల్లి, నారాయణపురం వద్ద పెద్ద, పెద్ద మలుపులున్నాయి.

హెచ్చరిక బోర్డులు లేవు



మలుపులు, రద్దీగా ఉన్న జంక్షన్ల వద్ద హెచ్చరిక బోర్డులు లేవు. రేడియం బోర్డులు లేక రాత్రి వేళలో ప్రయాణాలు చేసేవారు ప్రమాదాల బారినపడుతున్నారు. మలుపుల వద్ద స్పీడు బ్రేకర్లు వేయాలి.

– పైడి మోహనరావు, మతలబుపేట, సరుబుజ్జిలి మండలం

భద్రతా చర్యలు చేపట్టడం లేదు



ప్రయాణికుల భద్రతా చర్యల పట్ల అధికారులు శ్రద్ధ చూపడం లేదు. కూలిపోయిన కల్వర్ట్ గోడలు, స్కూల్, ఆస్పత్రి జోన్లు వద్ద హెచ్చరిక బోర్డులు లేవు. దీనివలన ప్రతి రోజూ ఎక్కడో ఒకచోట ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి.

– సిరిపల్లి శ్రీనివాసరావు, మూలసవలాపురం, సరుబుజ్జిలి మండలం

సత్వర చర్యలు తీసుకొంటాం

గతంలో ఏర్పాటు చేసిన ప్రమాద హెచ్చరిక బోర్డులు పాడయ్యాయి. వాటి స్థానంలో కొత్త వాటిని ఏర్పాటు చేస్తాం. మలుపులున్న ప్రదేశాలను గుర్తించి వెంటనే స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేస్తాం. కల్వర్ట్ రక్షణ గోడలను మరమ్మత్తులు చేస్తాం.

– ఆంజనేయనాయక్, ఆర్అండ్‌బీ, జేఈ

మా మొర ఆలకించండి



నేటికీ గిరిజనులకు రేషన్ సమస్యలు వెంటాడుతూనే ఉన్నాయి. మా మొర ఆలకించాలని గిరిజన నాయకులు, ప్రజలు కోరారు. మెళియాపుట్టి తహసీల్దార్ పాపారావుకు బుధవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా గిరిజన నాయకులు మాట్లాడుతూ.. కొత్తూరు పంచాయతీ పరిధిలోని దబ్బగుడ్డి, గేటుపేట, పెద్దకేదారి గ్రామాల గిరిజనులు రేషన్ సరుకులు తీసుకోవడానికి 10 కిలో మీటర్ల దూరంలో ఉన్న రామచంద్రాపురం వెళ్లాల్సి వస్తోందన్నారు. ఈ సమస్య పరిష్కారం కావాలంటే పెద్ద కేదారిలో రేషన్ ఉప కేంద్రాన్ని ఏర్పాటు చేయాలన్నారు. ఈ విషయాన్ని పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు, పలువురు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. గిరిజన నాయకులు సవర కుమార్, బైరిసింగి ధరణి, తదితరులు పాల్గొన్నారు.

– మెళియాపుట్టి

రోడ్డుపై మురుగునీరు నిల్వ



ఈ చిత్రం సారవకోట మండలంలోని కిడిమి బుడితి గ్రామం నుంచి మదనాపురం వెళ్లే రహదారి. మదనాపురం వద్ద రోడ్డుకు అడ్డంగా మురుగు, వర్షం నీరు నిల్వ ఉండటంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. రోగాలను వ్యాపింపజేసే దోమలు, ఈగలు పెరుగుతున్నాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. దీనిపై స్పందించి అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

– సారవకోట

రాళ్లు తేలిన రహదారి



ఈ చిత్రం ఆమదాలవలస నుంచి శ్రీకాకుళం వెళ్లే మార్గంలోని చింతాడ వద్ద దుస్థితి ఇది. ఈ రోడ్డులో పలుచోట్ల కల్వర్టులు నిర్మించి రహదారి పనులు పూర్తిచేయకపోవటంతో ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. ఆమదాలవలస నుంచి శ్రీకాకుళం పట్టణానికి వెళ్లే ప్రధాన రహదారి నిర్మాణ పనులను గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సుమారు 80 శాతం పూర్తిచేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర పూర్తవుతున్నా కల్వర్టులున్న చోట రహదారి నిర్మాణం చేయకపోవటంతో రాళ్లతేలి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కల్వర్టులున్న చోట రహదారి నిర్మాణం పూర్తిచేయాలని కోరుతున్నారు.

– ఆమదాలవలస రూరల్

కుక్కలకు నిలయం..!



ఈ చిత్రం ఆమదాలవలస మండలంలోని కలివరం గ్రామం వద్ద నిర్మించిన బస్ షెల్టర్. ప్రయాణికులు వేచి ఉండేందుకు నిర్మించిన బస్ షెల్టర్ కుక్కలకు నిలయంగా మారింది. రాత్రీ, పగలూ కుక్కలు తిష్టవేస్తున్నాయి. ప్రయాణికులు వేచి ఉండేందుకు అవకాశం లేకపోవటంతో సమీపంలో ఉండే చెట్లు కింద ఉంటున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు అక్కడ నుంచి కుక్కలను తరలించి, ఆ నిలయంలో ప్రయాణికులకు నీడ కల్పించాలనిన పలువురు కోరుతున్నారు.

– ఆమదాలవలస రూరల్


నిధుల విత్‌డ్రాకు వీలు కల్పించాలి

- ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రమణ

ఆమదాలవలస: పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు జరగని పాఠశాలల్లో నిధుల విత్‌డ్రాకు అనుమతి ఇవ్వాలని ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రమణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని అక్కులపేట, బొబ్బిలిపేట, కొల్లివలస, చిట్టివలస, ధర్మాన్నపేట, తురకపేట, దివంజీపేట, జొన్నవలస పాఠశాలలను బుధవారం సందర్శించారు. అక్కులపేట జెడ్పీ హైస్కూల్‌లో ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. 2024 ఆగస్టు 9న ఎస్ఎంసీ ఎన్నికలు జరిగాయన్నారు. జిల్లాలోని ఆరు పాఠశాలల్లో కోరం లేక, వివిధ కారణాలతో ఎస్ఎంసీ ఎన్నికలు ఇప్పటికీ జరగలేదని, ఆ పాఠశాలల సీఎఫ్ఎంఎస్ ఖాతాల్లో జమవుతున్న నిధులను విత్‌డ్రా చేసుకోలేకపోతున్నామన్నారు. ఆయా పాఠశాలల్లో అభివృద్ధి పనులు, జాతీయ పండుగల నిర్వహణ, డైలీ నిర్వహణ కోసం హెచ్ఎంలు వ్యక్తిగతంగా ఖర్చు చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఎంఈఓలు, హెచ్ఎంల సంతకాలతో నిధుల విత్‌డ్రాకు అవకాశం ఉండేదని, ఇప్పుడు ఆ విధానం లేకపోవడంతో గత విద్యా సంవత్సరంలో నిధులు వెనక్కి వెళ్లిపోయాయన్నారు. ఎన్నిసార్లు జిల్లా ప్రాజెక్ట్ అధికారిని సంప్రదించినా ఫలితం లేదన్నారు. కలెక్టర్, ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని తక్షణమే నిధుల విత్‌డ్రాకు అవకాశం కల్పించాలన్నారు. మండల అధ్యక్షుడు బి.రమేష్ కుమార్, హెచ్ఎం డి.జయలక్ష్మి, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శ్రీకాకుళంలోనే కొనసాగించాలి

- వైఎస్సార్‌సీపీ నేతల హెచ్చరిక



ఎల్.ఎన్.పేటలో సమావేశానికి హాజరైన వైఎస్సార్‌సీపీ నాయకులు

హిరమండలం: పాతపట్నం నియోజకవర్గాన్ని కొత్తగా ఏర్పడబోయే పలాస జిల్లాలో కలపవద్దని ఎల్.ఎన్.పేట మండలానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు డిమాండ్ చేశారు. ఎల్.ఎన్.పేట మండల కేంద్రంలో పార్టీ నాయకులు బుధవారం సమావేశం నిర్వహించారు. భౌగోళిక పరిస్థితులు, రవాణా, ఇతరత్రా వసతుల దృష్ట్యా శ్రీకాకుళంలోనే పాతపట్నం నియోజకవర్గం ఉండడం సముచితమన్నారు. కూటమి పాలకులు పాతపట్నాన్ని పలాసలో కలిపే ప్రయత్నం చేస్తుండడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. అదే జరిగితే వైఎస్సార్‌సీపీ తరఫున ఉద్యమిస్తామన్నారు. పాతపట్నం నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించాల్సింది పోయి.. ఇలా జిల్లాల విభజనతో ప్రమాదంలో పెట్టే ప్రయత్నం చేస్తుండడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పలాసలో కలిపే ప్రయత్నాన్ని మానుకోవాలన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు పెనుమజ్జి విష్ణుమూర్తి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి శిమ్మ సాంబశివరావు, పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి జి.యోగేశ్వరరావు, మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు రెడ్డి రామారావు, పార్టీ మండల ఉపాధ్యక్షుడు ఈగల చిన్నారావు, సర్పంచ్‌లు ముగడ దివాకర్‌నాయుడు, బలగ గోవిందరావు, నాయకులు కొల్ల కృష్ణ, కాగాన సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.

పలు కుటుంబాలకు పరామర్శ



పొట్నూరు హరనాథరావు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు, కృష్ణచైతన్య, తదితరులు

నరసన్నపేట: నరసన్నపేట, కంబకాయ గ్రామాల్లోని పలు కుటుంబాలను మాజీ రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు, ధర్మాన రామదాసు, పోలాకి జెడ్పీటీసీ సభ్యుడు ధర్మాన కృష్ణచైతన్య బుధవారం పరామర్శించారు. నరసన్నపేట పట్టణంలోని ఇందిరానగర్‌కు చెందిన పొట్నూరు హరనాథరావు ఇటీవల మృతి చెందడంతో ఆ కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలిపారు. ఇటీవల పొట్నూరు వెంకట పార్వతీశ్వర గుప్త మృతి చెందారు. గుప్త సోదరులను పరామర్శించారు. కంబకాయలో గుండెకు శస్త్ర చికిత్స చేసుకొని కొలుకుంటున్న పాగోటి ప్రభాకర్, కాలికి గాయమై ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న పాగోటి విష్ణు ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. దేశవానిపేటకు చెందిన ముద్దాడ గోవిందరావు రోడ్డు ప్రమాదంలో గాయపడడంతో ఆయనను, అనారోగ్యంతో బాధపడుతున్న బోయిన సాయిన్న శెట్టిని పరామర్శించారు. ఎంపీపీ ఆరంగి మురళి, పార్టీ నాయకులు చింతు రామారావు, గుప్త, తంగుడు జోగారావు, ధర్మాన జగన్ ఉన్నారు.

సైబర్ మోసాలపై అవగాహన

పొందూరు: ఆర్థిక అక్షరాస్యత, సైబర్ మోసాలపై విద్యార్థులకు అవగాహన ఉండాలని లీడ్ బ్యాంక్ ఎల్‌డీఎం శ్రీనివాస్ అన్నారు. కింతలి జూనియర్ కళాశాలలో విద్యార్థులకు పలు అంశాలపై బుధవారం అవగాహన కల్పించారు. బ్యాంకు ఖాతాలు తెరవడం, పొదుపు ప్రాముఖ్యత, ఆన్‌లైన్ లావాదేవీలు, ఏటీఎం పిన్, ఓటీపీ వంటి అంశాలను వివరించారు. బ్యాంక్ ఖాతాలో నగదు తరగుతున్నట్లు గుర్తించిన వెంటనే 1930 నంబర్‌ను సంప్రదించాలన్నారు. బ్యాంకింగ్ సేవలకు సంబంధించి సమస్యలు ఎదురైతే అంబుడ్స్‌మన్ 14448 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. పెనుబర్తి ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ భాస్కరరావు, తోలాపి ఏపీజీవీబీ మేనేజర్ మనోహర్, కళాశాల అధ్యాపకులు హరినాథ్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహం

జలుమూరు: మండలంలోని చల్లవానిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2024–25 విద్యా సంవత్సరంలో పది పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు అదే గ్రామానికి చెందిన పాగోటి భాస్కరరావు నగదు ప్రోత్సాహకాన్ని అందించారు. విద్యార్థులు ముద్దాడ లిఖిత, పొన్నాన అంజలి, జలుమూరు తనూష, నెయ్యిల లావణ్య, ధర్మాన నిర్మల ఉత్తమ మార్కులు సాధించారు. వీరి తరఫున రూ.2 వేల చొప్పున తల్లిదండ్రులకు అందించారు. హెచ్ఎం నిర్మలాదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంఘాల బలోపేతంతోనే హక్కుల సాధన

జలుమూరు: ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల బలోపేతంతోనే హక్కులను సాధించుకోవచ్చని ఏపీటీఎఫ్(1938) రాష్ట్ర సహాధ్యక్షుడు చింతాడ దిలీప్ అన్నారు. మండలంలోని అల్లాడ, అచ్యుతాపురం, యలమంచిలి, శ్రీముఖలింగం ఉన్నత పాఠశాలల్లో యూనియన్ ప్రత్యేక సమావేశాలను బుధవారం నిర్వహించారు. సంఘం ఐక్యతే ప్రధానమన్నారు. అనంతరం సభ్యత్వ నమోదు చేపట్టారు. జిల్లా గౌరవ అధ్యక్షుడు టెంక చలపతి, జిల్లా అధ్యక్షుడు బి.వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి బి.రవి, మండల ప్రతినిధులు బి.కేశవరావు, టి.లక్ష్మణరావు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కార్యవర్గం ఎన్నిక

పాతపట్నం: స్థానిక పండిత వీధిలోని ఏపీయూఎస్ కార్యాలయంలో మండల కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా మురళీమోహన్ పాత్రో, ప్రధాన కార్యదర్శిగా సోమేశ్వరరావు, గౌరవ అధ్యక్షుడిగా శరత్ చంద్రపాడీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర కార్యదర్శి డి.చలపతిరావు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఉద్యోగులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న డీఏలు, పీఆర్సీలను ప్రకటించాలన్నారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



నరసన్నపేట: కబడ్డీ ఆడుతున్న విద్యార్థినులు



హిరమండలం: ఖోఖో ఆడుతున్న విద్యార్థులు



కొత్తూరు: కబడ్డీలో తలపడుతున్న విద్యార్థినులు

హిరమండలం: క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని ఎంపీపీ తూలుగు మేనక అన్నారు. మండలంలోని కార్మెల్ ప్రైవేట్ పాఠశాల ఆవరణలో మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడా పోటీలను బుధవారం ప్రారంభించారు. ఈ పోటీల్లో 12 పాఠశాలల నుంచి 350 మంది విద్యార్థులు పాల్గున్నారు. ఎంఈఓలు కె.రాంబాబు, దాలయ్య, మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు టి.తిరుపతిరావు, హెచ్ఎంలు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నియోజకవర్గ స్థాయికి 136 మంది ఎంపిక

నరసన్నపేట: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయిలో క్రీడా ఎంపికలు సజావుగా పూర్తయ్యాయి. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల్లో మండల స్థాయి ఆటల పోటీలు బుధవారం నిర్వహించారు. ఈ పోటీలను ఎంఈఓ శాంతారావు ప్రారంభించారు. వివిధ స్కూళ్ల నుంచి 350 మంది విద్యార్థులు హాజరుకాగా.. వీరిలో 136 మందిని నియోజకవర్గస్థాయి పోటీలకు ఎంపిక చేశామని పీడీ ఎం.వి.రమణ తెలిపారు. అండర్ 14, అండర్ 17 విభాగాల్లో ఐదు ఈవెంట్లలో పోటీలు నిర్వహించామన్నారు. కబడ్డీ 28 మంది, వాలీబాల్ 28 మంది, ఖోఖో 40 మంది, బ్యాడ్మింటన్ 20 మంది, యోగా పోటీలకు 20 మందిని నియోజకవర్గ స్థాయికి ఎంపిక చేశామన్నారు. పలువురు పీడీలు, పీఈటీలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

150 మంది ఎంపిక..

కొత్తూరు: మండలంలోని కుంటిభద్ర జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఈ నెల 9న ప్రారంభమైన మండల స్థాయి క్రీడా పోటీలు బుధవారంతో ముగిశాయి. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఆటల పోటీలు నిర్వహించారు. కబడ్డీ, యోగా, ఖోఖో, బ్యాడ్మింటన్, వాలీబాల్, తదితర ఆటల పోటీల్లో మండలంలోని 15 పాఠశాలల నుంచి 475 విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో 150 మంది విద్యార్థులను నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు.